www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 మే 2023
5
అన్నమయ్య

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రాయచోటిలో ఎండ వేడిమితో మధ్యాహ్నం వేళలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

బాబోయ్.. ఎండలు

ఎండలు మండిపోతున్నాయి.. మాడలు మలమల మాడుతున్నాయి.. భానుడి భగభగలతో జనాలు విలవిల్లాడుతున్నారు.. ఉదయం 8 గంటలకే ఉప్పెనలా ఎండలు ఆరంభమై సాయంత్రం 6 గంటల వరకు తీవ్రంగా కొడుతున్నాయి. ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరి, ఎన్నడు లేనివిధంగా అత్యధికంగా నమోదవుతున్నాయి. రోజురోజుకు క్రమక్రమేనా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే నాలుగు రోజుల నుంచి 41-43 డిగ్రీలు దాటుతూ వస్తోంది. రోజు రోజుకు అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం బెంబెలెత్తి పోతున్నారు. మరో నాలుగు రోజుల పాటు ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వడగాలులు వీస్తాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి-రాయచోటి

భానుడి ప్రతాపంతో జనం విలవిల
రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

రోడ్ల మీద జనం లేక..

జిల్లా కేంద్రమైన రాయచోటిలో బుధవారం వేసవి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటి పోవడంతో మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ నిర్మానుషంగా మారిపోతున్నాయి. ఎండలకు తోడు వడగాలులు కూడా వీస్తోండటంతో జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. ఎక్కడా చూద్దామన్న రోడ్లపై ఒక్కరూ కనిపించడం లేదు. ప్రధాన రోడ్లతో సహ అన్ని రహదారులు నిర్మానుషంగా కనిపిస్తున్నాయంటే కర్ఫ్యూ లాగుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపే ప్రజలు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఆపై ఏమైనా పనులు ఉంటే సాయంత్రం ఆరు గంటల తర్వాత బయటకు వస్తున్నారు. అంటే దాదాపు మధ్యాహ్నం నాలుగు గంటల పాటు రోడ్లపై ఒక్కరూ కనబడడం లేదు.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి..

ఎండ వేడిమితో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. బయటకు వద్దామంటే ఎండ.. ఇంట్లో ఉంటే ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయికి చేరుకోవడంతో ఫ్యాన్లు, కూలర్లు కూడా సరిపోవడం లేదు. ఫ్యాన్లు వేసినా వడగాలి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే బయటకు వచ్చిన సమయాల్లో కూడా ఎండ నుంచి రక్షణ పొందేందుకు గొడుగులు, టవళ్లు, టోపీలను ఆశ్రయిస్తున్నారు. మరో పక్క దాహార్తిని తీర్చుకోవడానికి శీతలపానీయాలు చెరుకు రసం, లస్సీ, జ్యూస్ లాంటివి సేవిస్తున్నారు. మొత్తానికి అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..ఎండ వేడిమితో ప్రజలు సతమతమవుతున్నారు. ఇలానే పెరుగుతూ వడగాలులు తీవ్రమైతే వడదెబ్బకు గురికాకుండా వేసవితాపం నుంచిరక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు రావాలని ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్ల వద్దని చెబుతున్నారు.

మజ్జిగ ఎక్కువగా తాగాలి...

వేసవి కాలంలో ఎండ వేడి నుండి కాపాడుకోవాలంటే ప్రజలు శీతల పానీయాలను తాగకుండా చక్కగా నిమ్మకాయతో కలిపిన మజ్జిగను ఎక్కువగా తాగినవల్ల నీరసం రాకుండా ఎండ వడదెబ్బ తగలకుండా శరీరాన్ని కాపాడుకోవచ్చు. పానీయాలు ఎప్పటికప్పుడు ఉపశమనం కలిగిస్తాయి తప్ప వాటి వల్ల ఆరోగ్యానికి ఎంతో ప్రమాదకరం ఉంది. శీతల పానీయాలలో రుచి కోసం రంగు కోసం పలు రకాల కెమికల్ పదార్థాలను కంపెనీలు వాడి ప్రజలను ఆకర్షించే విధంగా చేస్తున్నారు.

- ప్రకాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి, జెవివి, రాయచోటి.

ఎండకు ఎవరూ తిరగొద్దు..

ప్రజలు ఎవరూఎండల్లో తిరగవద్దు. వడదెబ్బకు గురికాకండి. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ వేడిమి ఎక్కువగా ఉండటం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇంటి దగ్గర కూడా మజ్జిగ, నిమ్మరసం, పండరసాలు కర్బూజ పండ్లు, తాటి నుంజలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితులు అయితేనే బయటికి రావాలి. వడదెబ్బకు గురైతే ప్రభుత్వ వైద్యుల సలహాలు, సూచనలు పాటించి వైద్య సేవలు పొందాలి. జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల్లో మందులు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ ఎన్.కొండయ్య, డిఎంహెచ్‌ఒ, రాయచోటి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని, వడగాల్పులు ఎక్కువ అవుతున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో 41 నుంచి 43 డిగ్రీల వరకు ఎండలు భగ్గుమంటున్నాయి. వడగాడ్పుల ముప్పు పొంచి ఉంది. రోహిణి కార్తె సమీపించినందున ఎండలు పెరుగుతాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

- పిఎస్.గిరీష, కలెక్టర్, అన్నమయ్య జిల్లా.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి టౌన్)

వేసవిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. బుధవారం సంబేపల్లి మండలం గుట్టపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల పని ప్రదేశాన్ని పరిశీలించి కూలీల సమస్యల అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ ఫథకాన్ని నిర్వీర్యం చేసి కాలక్రమేణ ఈ పథకానికయ్యే ఖర్చును పెట్టుబడిదారులకు ఇవ్వాలని కుట్రపన్నుతున్నాయని విమర్శించారు. ఫలితంగానే నెలల కొద్ది బిల్లులు పెండింగ్‌లో ఉంచడం, బడ్జెట్‌లో నిధులు తగ్గించడం ఉపాధి నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వంటి పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. వేసవిలో మజ్జిగ, తాగునీరు షామియానా షెల్టర్ ఫస్ట్ ఎయిడ్ కిట్లు, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో భూమి లేని పేద ప్రజానీకం 65 శాతం ఉన్నారని. మరోవైపు వలసలు వెళ్తున్నారని తెలిపారు. వలసలు నివారించాలంటే భూ పంపిణీతో పాటు ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పొడిగించి ప్రతి రోజు 600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటరమణ, అశోక్, గంగయ్య, కిషోర్, మంగమ్మ, రాధ, పలువురు ఉఫాధి కూలీలు పాల్గొన్నారు.

ఎఫ్‌యూ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కడప అర్బన్



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న విసి సురేంద్రనాథ్‌రెడ్డి

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, అర్బన్ రీజనల్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన మొదటి సెమిస్టర్, మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి విడుదల చేశారు. బుధవారం విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగంతో కలిసి ఫలితాలను స్క్రీన్‌పై విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ మొదటి సెమిస్టర్ కాలేజ్ అఫ్ ఫైన్ ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్‌లో 96 శాతం, ముడవ సెమిస్టర్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ 76 శాతం, మూడవ సెమిస్టర్ అర్బన్ రీజనల్ ప్లానింగ్ 80 శాతం, ఐదవ సెమిస్టర్ కాలేజ్ అఫ్ ఫైన్ ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ 80 శాతం మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్ కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ ఇసి.సుప్రియ, పరీక్షల నియంత్రణ సహాయ అధికారి ఉదయ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సిఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ వడ్డిపల్లి, మల్‌రెడ్డిగారిపల్లి, ఎర్రంరెడ్డిగారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పథకాలను వివరించారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలు ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేస్తున్న సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జడ్పీటీసీ నిర్మల, నాయకులు నరసింహులు, రాయుడు, ఆనంద, రవి, చంద్రశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, విశ్వనాథం, రాజాబాబు, సుబ్బు, పట్టాభి, రామారావు, చిన్నోడు, చలపతిపాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న వినయ్‌కుమార్

వినయ్‌కుమార్ సేవలు స్ఫూర్తిదాయకం

రాయచోటి : డాక్టర్ అబ్దుల్ కలాం యువ ట్రస్ట్ డైరెక్టర్, యూత్ ఐకాన్ వినయ్ కుమార్ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని డిఎస్‌పి సయ్యద్ మహబూబ్ బాషా కొనియాడారు. యూత్ ఐకాన్ వినయ్ కుమార్ జన్మదిన సందర్భంగా బుధవారం దీప బ్లడ్ బ్యాంక్ నందు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 25 మంది రక్తదాతలు రక్తదానం చేయడం జరిగింది. ముఖ్య అతిథులుగా డిఎస్‌పి సయ్యద్ మహబూబ్ బాషా, డాక్టర్ మహేశ్వర రాజు, హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ వినయ్ కుమార్ సేవల స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని, విద్యార్థి స్థాయిలో నుంచే విద్యార్థి నాయకుడుగాను, విస్తృత స్థాయి సేవా కార్యక్రమాలతో ఎదిగి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు తోడ్పడాలన్నారు. రక్త దానం చాలా మంచి కార్యక్రమం ప్రతి ఒక్క యువత రక్త దానం చేయడానికి ముందుకి రావాలన్నారు. తన జన్మదిన సందర్భంగా రక్తదానం చేయడం యువతకు ఆదర్శమన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినయ్ కుమార్ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. విద్యార్థులు ఇలాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.వినయ్ కుమార్ చేస్తున్న సేవలు హర్షణీయం. వారి జన్మదినం సందర్భంగా రక్తదానం చేయించడం, నిరుపేదలకు, అనాధలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. రక్తదానం చేయడం ద్వారా శరీరంలో తిరిగి కొత్త రక్తం ఉత్పత్తి కావడమే కాకుండా మంరింత ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి 6 నెలలకొకసారి రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి యూత్ ఐకాన్ వినయ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేష్మ మాస్టర్, మహేష్, ఫాటన్, మురళి, షాజహాన్, మనోహర్, హుసేన్, ఫాయడ్, సాయి, రక్త దాతలు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించేందుకే వేసవి శిక్షణ

మదనపల్లె అర్బన్ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మదనపల్లి ప్రధాన శాఖ గ్రంథాలయ అధికారిణి కె.వసంత కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులు ఉత్సహంగా, ఉల్లాసంగా పాల్గొని అధ్యాపకులు చెప్పే పాఠాలను చక్కగా వింటున్నారన్నారు. విద్యార్థులకు ఉపాద్యాయులు తెలుగు,ఇంగ్లీష్,న్యూట్రిషన్ అంశాల గురించి వివరించారు. ప్రతిరోజు పలు అంశాలపై విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రెడ్డెప్ప (ఇంగ్లీష్), ప్రసాద్ శర్మ (తెలుగు), విజయలక్ష్మి (యోగా, ధ్యానం, కథలు), మదన్ మోహన్ (మానవతా విలువలు),చంద్రకళ (న్యూట్రిషన్) తరగతులను విద్యార్థులకు చక్కగా బోధిస్తున్నారని కితాబునిచ్చారు. వారి సహకారం మరువలేనిదన్నారు. వారంలో ఒకరోజు ప్రముఖులను పిలిపించి ఇన్స్పిరేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు.ప్రతిరోజు ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయని, జూన్ 11వ తేదీ వరకు ఈ వేసవి విజ్ఞాన శిబిరం జరుగుతుందన్నారు. కావున మదనపల్లి పట్టణంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,తమ మేధోసంపత్తిని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు గొల్లపల్లి రింగ్ రోడ్డులోని శాఖ గ్రంథాలయ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న వసంతకుమారి

వేరుశనగ విత్తనకాయలు పంపిణీకి చర్యలు

నెలాఖరుకు రైతు భరోసా నగదు బదిలీ
మదనపల్లె ఎడిఎ శివశంకర్ వెల్లడి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఈ నెలాఖరుకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీకి చర్యలు తీసుకుంటామని మదనపల్లె డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శివశంకర్ తెలిపారు. తమ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ వేరుశనగ సాగుకు మదనపల్లి డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు గాను 28,195 కేసిక్స్, నారాయణి విత్తనకాయలు పంపిణీకి ప్రతిపాదనలు పంపడం జరిగిందని వెల్లడించారు. ఇందులో మదనపల్లి మండలానికి 2800 క్వింటాళ్లకుగాను 1400 క్వింటాళ్లు అలాట్మెంట్ వచ్చిందని వివరించారు. నిమ్మనపల్లి మండలానికి 1620 క్వింటాళ్లు కే సిక్స్ రకంకు 810, 1575 క్వింటాళ్లు నారాయణి రకంకు 788 కలిపి 3195 గాను 1598 అలాట్మెంట్ జరిగిందని పేర్కొన్నారు. రామసముద్రం మండలానికి 2300 క్వింటాళ్లకు 1150 క్వింటాళ్లు కేటాయించడం జరిగిందన్నారు. డివిజనులోని అన్ని మండలాలకు వేరుశనగకాయలను అలాట్ చేయడం జరిగిందన్నారు. ఇందులో కె6 రకం 30 కిలోల బస్తా రూ.2790 అయితే 40 శాతం రాయితీ రూ.1116 పోను రైతులు రూ.1674 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. లేపాక్షి రకం 30 కిలోలు రూ.2490 అయితే 40 శాతం రాయితీ రూ.995 పోను రైతులు రూ.1494 చెల్లించ వలసి ఉంటుందన్నారు. కావున విత్తనపు కాయలు కావలసిన ప్రతి రైతు అర్బికే లో వ్యవసాయ సహాయకులు వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరుకు రైతు భరోసా నగదు బదిలీ ని ప్రభుత్వం జమ చేయనున్నదని తెలిపారు. జులై నెల రెండవ వారం వరకు విత్తనాలు వేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. జూన్ నెల మొదటి వారం నుండి రైతు భరోసా కేంద్రాలలో పురుగు మందులు అందుబాటులో వుంటాయని పేర్కొన్నారు. ఇక రైతు బరోసా లబ్ధిదారులు జాబితాను ఈ నెల 15వ తేదీ నుండి 18 వరకు అర్బికే సోషల్ అడిట్ కోసం జాబితాను ప్రదర్శించడం జరుగుతోందని, ఇందులో అర్హత ఉండి, అవకాశం రానివారెవరైనా ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకుంటే ఈ నెల 20వ తేదీలోపు పరిశీలించి సిపారసు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ గిరీష తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం, నారంరాజుపల్లి (ఆకేపాడు)లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-2024 విద్యా సంవత్సరంలో 11వ తరగతి యందు ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయుటకు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో, అన్నమయ్య/కడప జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుండి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు 31-05-2023 చివరి తేదీ అన్నారు. పూర్తి వివరాలకు www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. 22-07-2023 తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని పదో తరగతి పాసైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

- ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి

రాయచోటి: ఈ నెల 19 నుంచి 22 తేదీ వరకు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఐసిడిస్ వివిధ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్నటువంటి అంగన్‌వాడీ కార్యకర్తలు 14, సహాయకురాలు 53, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 13 పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులకు రెవిన్యూ డివిజన్ల వారిగా దిగువ తెలిపిన తేదీలల్లో , సమయాల్లో మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. మదనపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అంగన్ వాడీ పోస్టులకు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. రాజంపేట రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అంగన్ వాడీ పోస్టులకు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అదే విధంగా రాయచోటి రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అంగన్ వాడీ పోస్టులకు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు రాయచోటి ఆర్ డిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ధరఖాస్తు చేసుకొని అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు వారి యొక్క రెవిన్యూ డివిజన్ కు కేటాయించిన తేదీలలో సూచించిన సమయమునకు, కేటాయించిన ప్రదేశమునకు మౌఖిక పరీక్షకు వారి యొక్క అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని హాజరు కావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ లేని అభ్యర్థులను మౌఖిక పరీక్షకు అనుమతించబడదన్నారు.

మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

మదనపల్లె అర్బన్ : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు ఎస్.ఎ.కరీముల్లా పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు రూ.80 వేలు అదనపు భారం పడనుందన్నారు. ఈ భారాన్ని ప్రభుత్వమే భరించేందుకు జిఒ విడుదల చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎంపీ మిథున్‌రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ గౌసుల్ ఆజం, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ ఖాదర్ బాషాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాల కోసం భూపోరాటం

అడ్డుకునేందుకు యత్నించిన రెవెన్యూ అధికారులు, పోలీసులు
ఎదురుతిరిగిన ప్రజలు, నాయకులు

ప్రజాశక్తి-గోపవరం

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎర్రజెండాలు పాతారు. మండలంలోని పిపి కుంట గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి అయిన సర్వే నెంబర్ 1603లో అర్హులైన పేదలతో కలిసి ఎర్రజెండాలు పాతి భూ పోరాటం చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ప్రజలు, సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎదురుతిరిగారు. అధికారులు, నాయకులకు వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ భూమిలో అధికారుల అనుమతి లేకుండా ఆక్రమణలకు పాల్పడడం చట్ట విరుద్ధమని ఈ పోరాటానికి కారకులైన వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్ నాయకులు వెంకటేష్, సిపిఎం మండల పార్టీ నాయకులు ఖాదర్ బాషా, పెంచలయ్య తదితరులను ఆర్‌డిఒ పిలుస్తున్నారని ఎస్‌ఐ చంద్రశేఖర్, తహాశీల్దార్ దామోదర్‌రెడ్డి పిలుచుకువెళ్లారు. 12.30 గంటలకు ఆర్‌డిఒ ఆఫీసుకు వెళ్లిన నాయకులను ఆర్‌డిఒ సమావేశం ఉందంటూ గంటల తరబడి నిరీక్షింపజేశారు. అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు నాయకులను తీసుకెళ్లారు. సాయంత్రం 5 గంటలకు అయినా ఆర్‌డిఒ వెంకటరమణ వద్దకు తీసుకెళ్లలేదు. నాయకులతో చర్చలు జరిపారు. దరఖాస్తు చేసుకుంటే ఇంటి స్థలాలు ఇస్తామని ఆర్‌డిఒ చెప్పారు. స్థలం అనుకూలంగా ఉండే చోట ఇస్తామని చెప్పారు. ప్రజలు కోరుకున్న చోట ఇచ్చేందుకు వీలుకాదన్నారు. దీనికి నాయకులు ఒప్పుకోలేదు. యోగ్యమైన చోట పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. భూ పోరాటం చేశారని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులపై ఆర్‌డిఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తర్వాత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

భూ పోరాటాన్ని అడ్డుకునేందుకు యత్నిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

భూపోరాటంలో కంప చెట్లు తొలగిస్తున్న నాయకులు

గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ లక్ష్మీపతి

శరవేగంగా గృహ నిర్మాణాలు : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కొంతమంది లబ్ధిదారులకు ప్రభుత్వం నగర పంచాయతీ పరిధిలోని కురవోనికుంట వద్ద జగనన్న కాలనీల్లో భాగంగా ఇళ్ల స్థలాలను కేటాయించింది. లబ్ధిదారులు శరవేగంగా నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులను బుధవారం డిఎల్‌డిఒ లక్ష్మీపతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలాలను కేటాయించి,ఇళ్ల నిర్మాణాలకు సహకారం అందిస్తోందన్నారు. ఈ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోందన్నారు. లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల శ్రేయస్సు కోసం అధికారులు పనిచేయాలని ఆయన హితవు పలికారు. డిఎల్‌డిఒ వెంట నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, కో-ఆప్షన్ మెంబర్ నాసర్ పాల్గొన్నారు.

గూడ్స్ వ్యాగన్‌లో పొగలు

- అప్రమత్తమైన రైల్వే అధికారులు

ప్రజాశక్తి-నందలూరు

కృష్ణపట్నం పోర్టు నుంచి గుంతకల్లు వైపు బొగ్గులోడుతో వెళుతున్న గూడ్స్ రైల్లోని ఒక వ్యాగన్‌లో పొగలు రావడంతో అప్రమత్తమైన అధికారులు పొగలను అదుపు చేసిన సంఘటన బుధవారం నందలూరు రైల్వే కేంద్రంలో చోటు చేసుకుంది. ఏడవ లైనులో నిలిచి ఉన్న కృష్ణపట్నం నుంచి గుంతకల్లు వైపు వెళ్తున్న గూడ్స్ రైల్లో చివర నుంచి రెండవ వ్యాగన్‌లో అకస్మాత్తుగా పొగలు రావడంతో దానిని గమనించిన విధులలో ఉన్న సిబ్బంది, రాజంపేట అగ్ని మాపక కేంద్రం వారికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పొగలను అదుపు చేశారు. పొగలను అదుపు చేయడంలో జీఆర్‌పి, ఆర్‌పిఎఫ్, రాజంపేట అగ్నిమాపక సిబ్బంది, స్థానిక రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

పొగలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వెలుగు పాఠశాలను సందర్శించిన ఐఓసి సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని కోళ్ళబైలు పంచాయతీ, అమ్మ చెరువుమిట్ట నందు వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమాన్ని చిత్తూరు నుంచి ఐఓసి సభ్యులు క్రాంతికుమార్, ప్రేమ్‌కుమార్ లు సందర్శించారు. వీరికి వెలుగు చిన్నారులు, వృద్ధ మహిళలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి వెలుగు సంస్థ ప్రారంభం నుంచి చేసిన సేవలను వివరించారు. మొదటగా వెలుగు ప్రత్యేక పాఠశాల తరగతులను, విద్యా బోధనలను గురించి తెలుసుకున్నారు. తర్వాత వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులను ప్రేమతో పలకరించి వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఇంత మంది దివ్యాంగులకు విద్యాబుద్ధులు చెప్పడం, వృద్ధులకు సేవ చేయడం ఎంతో గొప్ప విషయమని నిర్వాహకులను అభినందించారు. అనంతరం వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్‌రెడ్డి క్రాంతికుమార్, ప్రేమ్‌కుమార్, మొమెంటోను అంద జేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ లీలాకుమారి, చిన్నారులు పాల్గొన్నారు.

ఐఓసి సభ్యులను సన్మానిస్తున్న వెలుగు సెక్రటరీ

నేడు నిమ్మనపల్లిలో గడప గడపకూ..

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో గురువారం నుంచి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపిడిఒ లీలా మాధవి, వైసిపి పార్టీ మండల ఇన్‌ఛార్జి ఆర్‌ఐ రమణారెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం తెలిపారు. అందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి రాచవేటివారి పల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లిలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సర్పంచులు, ఎంపిడిసిలు, నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

గిరిజన కాలనీలో మోటార్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వెంకటేశ్వర్లు ఎస్‌టి కాలనీలో మోటార్లు ఏర్పాటు చేసి గిరిజనుల దాహార్తి తీర్చాలని జిల్లా అధ్యక్షులు ఎం.జయరామయ్య, మండల కన్వీనర్ నాగిపోగు పెంచలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెంగయ్య తెలిపారు. బుధవారం వారు ఎస్‌టి కాలనీని సందర్శించి గిరిజనుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమ పోరాటం ద్వారా ఎస్‌టి కార్పొరేషన్ నిధులతో తమ ప్రాంతంలో బోర్లు వేశారని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం విస్మరించారని గిరిజనులు తమ దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఎస్‌టి కాలనీలో మోటార్లు, ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్షాల అనుబంధ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను ఎస్‌ఐ పి.రామకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు తొలగించారు. బుధవారం ఎస్క్మి రామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని మదనపల్లి-నిమ్మనపల్లి రోడ్డు నందు నిమ్మనపల్లి నుంచి రాచవేటివారిపల్లి కొరకు రోడ్డు మలుపులలో ఉన్న ముళ్ళ పొదలను జెసిపి సాయంతో తొలగించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనపడడానికి ముళ్ల పొదలను తొలగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహనదారులు రోడ్డు మలుపులలో అప్రమత్తంగా వాహనాలు నడపాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజేష్, రామచంద్ర పాల్గొన్నారు.

దారిపోయినవి

సత్యసాయి జిల్లా, తనకల్లు మండలం, కోటపల్లి పంచాయతీ నివాసం ఉన్న ఇందుకూరి రామలింగ రాజు కుమార్తె ఇందుకూరి సాయినిశిష అను నేను 12/05/2023న ఉదయం తనకల్లు నుండి కెకె క్రాస్ బస్సు ప్రయాణం చేసినాను. సదరు బస్సు దిగి చూడగా నా బ్యాగు కనపడలేదు. అందులో విలువైన ఒరిజినల్ ధృవపత్రాలు కలవు. డాక్యుమెంటు నెంబరు 1047/2017 తేది.15/11/2017 తనకల్లు రిజిస్ట్రార్ కార్యాలయం నందు రిజిష్టర్ చేయబడింది. నా ఒరిజినల్ భూమి డాక్యుమెంట్లు దొరికినా తెచ్చి ఇవ్వవలసినదిగా కోరుచున్నాను. నాకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు: ఐ.నిషిత,
చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది,
సెల్: 9440028397

గంగమ్మ తిరుణాల

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రం సమీపంలోని వారపు రసంతతోపులో వెలసిన శ్రీ కోటకొండ గంగమ్మ తిరుణాలను ఘనంగా నిర్వహించారు. గంగమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు అభిషేకాలతో తిరుణాల వైభవంగా జరిగింది. పూజారులు శ్రీనివాసులు, చిన్నప్పలు ఇంటింటికి వెళ్లి అమ్మవారు తిరణాల చాటింపు చేశారు.

గుంతలమయం.. పట్టు తప్పితే ప్రమాదం!

ప్రజాశక్తి-గాలివీడు

గుంతల మయమైన తారు రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని స్థానిక మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు. గాలివీడు పట్టణంలోని బస్టాండు నుంచి మదనపల్లికి వెళ్లే రోడ్డు పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. అరవీడు, ఎల్లంపల్లి వరకు వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా ఉందన్నారు. నిత్యం ఈ మార్గంలో నిత్యం జీపులు, ఆటోలు, ద్విచక్రవాహనాలతో రద్దీగా ఉంటుందని రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాల బారినపడతామని భయాందోళన చెందుతున్నారు. అరవీడు నుంచి ఎల్లంపల్లికి మూడు కిలోమీటర్లు వెళ్లాలంటే ఉన్న దారులన్నీ అస్తవ్యస్థంగా ఉన్నాయని ఆవేదన చెందారు.కుషావతినది రోడ్డు సక్రమంగా లేక ఒకటి, సొసైటీ బిల్డింగ్ దగ్గర రోడ్డు దెబ్బతినడం, ఎల్లంపల్లి క్రాస్ దగ్గర ఇలా దారులన్నీ గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయని అన్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు.

గుంతలమయమైన రోడ్డు

పెచ్చులూడిపోయిన రోడ్డు

పదేళ్లుగా నరకప్రాయం

గత పదేళ్లుగా ఈ రోడ్ల ద్వారా ప్రయాణం నరకప్రాయంగా మారింది. గాలివీడు నుంచి మదనపల్లికి వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దుమ్ము, దూళి, గుంతల మయమైన రోడ్లకు సత్వరమే మరమ్మతులు చేయిం చాలి. రోడ్ల దుస్థితిని మార్చడానికి ప్రభు త్వం చర్యలు తీసుకోవాలి.

-ఖాదర్‌వలి, గాలివీడు

వాహనాల్లో వెళ్లాలంటే భయమేస్తోంది

వాహనాల్లో చిన్న పిల్లలను పిలు చుకొని వెళ్ళాలంటే భయమేస్తోంది. రోడ్లన్నీ గుంతల మయం కావడంతో ఎక్కడ జారీ కింద పడిపోతామోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు సకాలంలో స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయిస్తే బాగుంటుంది.

-సత్యనారాయణ, గాలివీడు

'పర్యావరణహిత' జీవనశైలిపై అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పర్యావరణహిత జీవనశైలి వైపు ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని మదనపల్లి డివిజన్ ఉప అటవీ క్షేత్రాధికారి(డిఆర్‌ఒ) జె.మదన మోహన్ అన్నారు. జూన్ 5 నుంచి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకొని పర్యావరణహిత జీవనశైలి పై రెడ్డివారిపల్లి సచివాలయం వద్ద స్థానిక సర్పంచ్ రెడ్డమ్మ, నరేంద్రరెడ్డి, పంచాయితీ కార్యదర్శి మారప్పలతో కలిసి గ్రామస్తులు, వాలంటీర్లతో కలసి అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని సూచించారు. ప్రకృతి వనరులైన నీరు, విద్యుత్తు, పెట్రోలు వంటి వాటిని దుర్వినియోగం చేయకుండా ఆదా చేయాలని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించడానికి మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని ప్రతి దినం తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని, అడవు లను సంరక్షించాలని కోరారు. చెట్లను నరకడం నేరమని తెలిపారు. చెట్లను పెంచడం వలన వాతావరణంలో ఆక్సిజన్ స్థాయి పుష్కలంగా ఉండటంతో మానవుని జీవితం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కాలుష్యాన్ని నివారించడానికి, పర్యావరణరహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రెడ్డివారిపల్లి సంపద తయారీ కేంద్రం వద్ద అటవీశాఖ అధికారులు గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ అధికారులు దీప, శ్రీదేవి, ప్రకాష్, శోభా, ఎబిఒలు కిరణ్, ఉమాదేవి, శేఖర్, పంచాయతీ కార్యదర్శి మారప్ప, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

అధికారుల తీరుపై ఎంపిపి ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా అధికారులు చొరవ చూపాలని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి చొరవతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో జరిగిన మండల సమావేశానికి ఎంపిపి, జెడ్పిటిసి అంబాబత్తిన లక్ష్మీదేవిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖల వారిగా అధికారులతో ప్రజా సమస్యల పై సమీక్ష చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలల్లో పనులు చేసిన కూలీలకు బిల్లులు చెల్లింపులలో 100 నుంచి 200 వసూలు చేస్తు న్నారని ప్రజా ప్రతినిధులు సభ దృష్టి కి తీసుకొచ్చారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులతో పాటు పురుగుమందులు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి కిషోర్‌నాయక్ తెలిపారు. ఈనెల 18 లోపు రైతుభరోసా కోసం గ్రామ సచివాలయాలలో నమోదు చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఆధార్ సీడింగ్ వెనకబడి ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ శంకర్‌రాజు ఎంపిడిఒ వెంకట్రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, నాగలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపిటిసి సభ్యులు కోదండ శ్రీలత, రామ సుబ్బమ్మ, యల్లమ్మ, లక్ష్మీనారాయణ, రాధా, దస్తగిరి, సర్పంచ్‌లు రమణయ్య, వెంకట నారాయణ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సిద్దక నాగిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, పిఆర్ఎఇ సుబ్రహ్మణ్యం, ఉద్యాన శాఖ అధికారి నాగమణి, ట్రాన్స్‌కో ఎఇ కృష్ణయ్య, ఎపిఎం నిరంజన్, హౌసింగ్ ఎఇ జనార్దన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారులూ.. ఫోన్లకు స్పందించండి

ప్రజాశక్తి-కురబలకోట

సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలు చెప్పాలని ప్రజా ప్రతినిధులు ఫోన్ చేసిన స్పందించడం లేదని ఎంపిపిదస్తగిరి అధికారులపై మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం తో పని చేస్తేనే ప్రజలు సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.విద్యుత్ శాఖ అధికారులు రైతులకు స్పందించడం లేదని సమావేశంలో సర్పంచ్ కృష్ణారెడ్డి అన్నారు. ట్రాన్స్‌పార్మర్‌లు అవసరమైన వారికి ఇవ్వకుండా అవసరం లేని వారికి ఇచ్చారన్నారు. చాలా మంది ట్రాన్స్‌పార్మర్‌లు సంవత్సరాలు కొద్దీ ఇంటిదగ్గర పెట్టుకున్నారని అన్నారు.వెంటనే రైతులకు నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకోవా లన్నారు. ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. పది పరీక్షా ఫలితాలలో కురబలకోట హైస్కూల్ చాలా దారుణంగా ఉందన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ భూముల సమస్యలను ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం చేస్తు న్నామని అన్నారు. జగనన్న కాలనీల్లో అందరిక్ ఇంటి పట్టాలు మంజూ రు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దిలీప్‌కుమార్, జడ్పిటిసి జ్యోతి, చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమాపతి రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రంగస్వామి

రైతుల అభిప్రాయం మేరకే నష్టపరిహారం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

కాలేటి వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు రైతుల అభిప్రాయం మేరకే నష్ట పరిహారం చెల్లించడం జరుగుతుందని ఆర్‌డిఒ రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో కుర్నూతుల, మద్దిరేవుల దిన్నెపాడు, ధప్పేపల్లే, కస్తూరిరాజుగారిపల్లె గ్రామాలకు చెందిన రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు కాకుండా రైతులు కోరిన అభిప్రాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం చెల్లించే విషయంలో న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో తాహశీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, సర్వేర్ కరీముల్లా, ఆర్‌ఐ సమ్మత్ ఖాన్, విఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు.

వైద్యం కోసం రోగుల పడిగాపులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది మధ్య మనస్పర్ధలు ఉన్నాయనే కారణంతో రోగులకు వైద్యసేవలు అందించ కుండా నిరీక్షణకు గురిచేశారు. వైద్యులు, సిబ్బంది ఉదయం 11 గంటల వరకు సమీక్ష సమావేశం కొనసాగించారు. ఈ విషయం పైన డాక్టర్ నీలోఫర్‌బేగం, సూపరింటెండ్ ను వివరణ కోరగా అవునండీ..మా ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది మధ్య చిన్నపాటి మనస్పర్ధలు రావడం వల్ల ఇలాంటివి..ఉండకూడదని చిన్న పాటి మీటింగ్ పెట్టుకున్నామండి..అంటూ ఓపి కి కదిలారు. ఉదయం 9 నుంచి అనారోగ్య కారణాలతో ఓపికి వచ్చిన రోగులు డాక్టర్లు ఎప్పుడు వచ్చి వైద్యం చేస్తారా అని ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

విద్యార్థులకు మెమోంటోలు అందజేత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు జ్ఞాపికలు, మెమోంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా మదనపల్లిలో బుధవారం పోర్డ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, వారికి సహకరించిన తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యాలను అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఇలానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు మొక్కలను పంపిణి చేస్తు మొక్కలతో పాటు విద్యార్థులు భవిష్యత్తు కూడా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలచిన మదనపల్లి విద్యార్థిని ఉన్నతిరెడ్డిని జ్ఞాపిక, దుశ్శాలువతో సత్కరించారు. వి.నందిని, హిమసాయి, రెడ్డిరాఘవి, కె ఛాయకృష్ణ, జి.వంశీ, షేక్‌సియా, ఫాతిమా, కె.సురేష్ నాయక్, జాస్మిన్ తాజ్‌లను సత్కరించి స్వీట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫోర్డ్‌సంస్థ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, మండల కో-ఆర్డినేటర్లు రాధారాణి, ఆవుల నరసింహులు, సిబ్బంది అల్తాఫ్ హుసేన్, సంపూర్ణ, ప్రభావతి, జ్యోతి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంటి పరీక్ష చేస్తున్న నేత్రాలయ ఆస్పత్రి సిబ్బంది

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలో నూతనంగా నిర్మించబడిన అరవింద్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యులతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బిపి, మధుమేహానికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఊటుకూరు పంచాయతీ కార్యదర్శి జే.బాల కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల కుమార్ మాట్లాడుతూ సుమారు 60 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 13 మందికి శుక్లాల సమస్య ఉన్నట్లు తేలిందని తెలియజేశారు. అరవింద్ ఆసుపత్రి వారు గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అరవింద్ నేత్రాలయ వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెమోంటోలు అందిస్తున్న నిర్వాహకులు

అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిపిఒ ధనలక్ష్మి

విద్యార్థులపై శ్రద్ధ వహించాలి : డిపిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, గర్భిణులు, బాలింతలపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిపిఒ ధనలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాచవేటివారిపల్లి, బొంతవారిపల్లి లోని అంగన్వాడీ కేంద్రాలను, సచివాలయాన్ని డిఎల్‌పిఒ జయకుమారి, సిడిపిఒ సుజాత, సర్పంచ్ సుబ్రమణ్యంలతో కలసి తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టి కాహారం వినియోగంపై ఆరా తీశారు. అనంతరం బొంతవారిపల్లిలో నూత నంగా నిర్మిస్తున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పను లను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎంపిడిఒ లీలామాధవి, సర్పంచ్ సుబ్రమణ్యంతో కలిసి రాచవేటివారిపల్లి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎరువలను తయారుచేసి స్థానికంగా విక్రయించి, పంచాయతీకి ఆదాయాన్ని సృష్టించాలని తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ సుజాత, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సూపర్వైజర్ భాను, లక్ష్మీదేవి, పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యూనిఫాం నిబంధనలను ఉల్లంఘించే సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని మదనపల్లి డిఎల్‌డిఒ లక్ష్మీపతి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఒకరిద్దరు మినహాయించి మిగతా సచివాలయం సిబ్బంది ఎవరు యూనిఫామ్ ధరించడం లేదని సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అందులో శాశ్వత ప్రాతిపదికన సచివాలయ ఉద్యోగులను నియమించి వారికి యూనిఫామ్ పంపిణీ చేసినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది యూనిఫామ్ ధరించకపోవడంతో సచివాలయాలకు సమస్యలపై ప్రజలు వెళ్తే ఎవరు వాలంటీర్లు, ఎవరు సచివాలయం సిబ్బంది అనేది తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిఎల్‌డిఒ లక్ష్మీపతి గృహనిర్మాణాలపై నాలుగవ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశానికి సైతం ఒకటో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఐదవ సచి వాలయం వెల్ఫేర్ యూనిఫామ్ ధరించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరల ఇది పునరావృతం అయితే సమన్లు జారీ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలిసిన ఎంపిపి నూర్జహాన్

ఎమ్మెల్యే 'చింతల'ను కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి-కలికిరి

మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో చర్చించినట్లు ఎంపిపి నూర్జహాన్ పేర్కొన్నారు. బుధవారం వాల్మీకిపురం మండలంలోని జర్రవారిపల్లి లో గడపగడప కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేను కలిసి మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, జరగబోయే కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి శక్తివంతం లేకుండా సహాయ సహకారాలు అందిస్తామని సానుకూలంగా స్పందించారని తెలిపారు.కార్యక్రమంలో మండల అభి వృద్ధి అధికారి గంగయ్య యాదవ్, ముస్లిం మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఫయాజ్, వేంపల్లిబావాజీ, సయ్యద్, నూర్ మొహమ్మద్ పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

నందలూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తూ, ఈ నెల నాలుగవ తేదీన అక స్మాత్తుగా గుండెపోటుతో మరణించిన రహీం బాబు కుటుంబానికి మంగళవారం ఎస్‌పి ఆర.గంగాధర్‌రావు రూ.2 లక్షల చెక్కును అందిం చారు. రహీం భార్య గిరిజామని, కుమారుడు కిషోర్‌లకు రాయచోటి పట్టణం లోని ఎస్‌పి కార్యాలయంలో అందుకున్నారు. ఆర్థిక సాయం అందించిన ఎస్‌పి, తోటి పోలీస్ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బి.కొత్తకోట : పిటిఎం మండలం పరిధిలోని కందుకూరు చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రవీంద్రబాబు తమ సిబ్బందితో కలిసి చెరువు వద్దకు చేరుకున్నారు. ఆయన కథనం మేరకు వివరాలు.. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, తెల్ల బనియన్, నలుపు, ఎరుపు తెలుపు చారలు కలిగిన నైట్ ప్యాంటు బట్టలు ధరించి ఉన్నాడన్నారు. ఎవరైనా మృతి చెందిన వ్యక్తిని గుర్తుపట్టినా,వివరాలు తెలిసినా ఎస్‌ఐ డి.రవీంద్రబాబు 9440900716 అనే మొబైల్ నంబరుకి తెలపాలన్నారు. ఎలా చనిపోయాడనే విషయం విచారణలో తేలనుందని ఎస్‌ఐ వెల్లడించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బి.కొత్తకోట : కారులో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్.ఐ.రామ్మోహన్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు వివరాలు.. పిటిఎం మండలం, కాయలవాండ్లపల్లికి చెందిన నాగరాజు (26) బి.కొత్తకోటలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, ఇతనికి ఫార్చునర్ కారు కూడాఉందన్నారు. నాగరాజు తరచూ కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొనివచ్చి బి.కొత్తకోట పరిసర ప్రాంతాల్లో రహస్యంగా విక్రయిం చేవా డన్నారు. మంగళవారం రాత్రి తన ఫార్చునర్ కారులో కర్ణాటక మద్యాన్ని తీసు కొని వస్తుండగా తమకు ముందస్తు సమాచారం అందిందన్నారు. దీంతో నాయనబావి-మొటుకు రహదారిలో గట్ల మీద తమ సిబ్బందితో కలిసి కాపు కాసామన్నారు. కారును ఆపి సోదాలు చేయగా రూ.25 వేలు విలువ చేసే 288 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను గుర్తించినట్లు తెలిపారు. మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకు న్నామన్నారు. నిందితుడిపై నెలరోజుల క్రితం బెంగళూరులోనే ఆర్‌టినగర్ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైందన్నారు. నాగరాజు వైజాగ్, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి ఈ ప్రాంతాల్లో విక్రయించేవాడని తెలిపారు.కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని, వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్య

పీలేరు : ఆర్థిక ఇబ్బందులతో ఆర్మీ జవాన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీలేరు మండలం, కావలిపల్లె పంచాయతీ, ములగూరవాండ్లపల్లెలో చోటు చేసుకుంది. వివరాలి లావున్నాయి. లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరాళ్ల గ్రామం సోమలోళ్లపల్లెకు చెందిన సోమల పెద్ద వెంకటరామయ్య కుమారుడు సోమల దేవంద్ర కుమార్(25) గత ఏడు సంవత్సరాలుగా శ్రీనగర్ లో ఆర్మీ జవాన్‌గా పని చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం మండలంలోని ముల్లగూరవాండ్లపల్లెకు చెందిన రామనారాయణ కుమార్తె వాణితో వివాహం జరిగింది. ప్రస్తుతం వాణి ఎనిమిది నెలల గర్భవతి. దేవేంద్రకుమార్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమ తమవుతుండేవాడు. రెండు వారాల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. అక్కడి నుంచి గత ములగూ రవాండ్లపల్లెలోని అత్తవారింటికి వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంటిలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నరసింహుడు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.